
MRR 69 TV


అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | సోమవారం 12 మే 2025 | పేజీలు : 4 | వెల : 3/-




## రాష్ట్రంలో రెండు రోజులు

# తీవ్రమైన వడగాలులు

### ఎండలో తిరిగేటప్పుడు నెత్తికి టోపీ లేదా రూమాలు తప్పనిసరి

### అప్రమత్తంగా ఉండాలని అధికారుల వెల్లడి

**(అంకుశం, అమరావతి, మే 12):**

రాష్ట్రంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఎండతీవ్రత పెరగనుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. సోమవారం పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కాకానిలో 43.7 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. 17 జిల్లాల్లో 41 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు రికార్డైనట్లు వెల్లడించారు. మంగళవారం కొన్ని ప్రాంతాల్లో 43.5 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 4, విజయనగరం 2, పార్వతీపురంమన్యం 11, కాకినాడ 3, తూర్పుగోదావరి జిల్లాలో ఒక మండలం చొప్పున, మరో 32 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. బుధవారం 22 మండలాల్లో తీవ్ర, 36 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. గురువారం రాష్ట్రంలో మోస్తారు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం-2, విజయనగరం%-%14, పార్వతీపురంమన్యం%-%2, అల్లూరి సీతారామరాజు%-%3, కాకినాడ%-%4, తూర్పుగోదావరి%-%7 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. సోమవారం పల్నాడు జిల్లా - మిగతా 2లో

## అత్యవసర పనులూ

# నాణ్యతగా ఉండాలి



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

రాష్ట్ర వ్యాప్తంగా కాలువల్లో పూడిక తీత, గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపు, షట్టర్లు, గేట్ల మరమ్మత్తులు, గ్రీజు పెట్టడం వంటి నిర్వహణ పనుల కోసం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 344 కోట్లు విడుదల చేశారని, ఈ పనులను స్వీయ పర్యవేక్షణ చేస్తూ, మే చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. సోమవారం విజయవాడలో జలవనరుల క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలు, ఎస్ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారాయన. ఈ సమావేశంలో ఇరిగేషన్ - మిగతా 3లో

## ఏజెన్సీలో గిరిజనులకే

# వంద శాతం ఉద్యోగాలు కల్పిస్తాం

- న్యాయ సమీక్షలో రద్దయిన జీవో నెంబర్ 3ను పునరుద్ధరణకు చర్యలు
- గిరిజన సంక్షేమ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు వెల్లడి
- “1986లో వచ్చిన జీవో ప్రకారం ఏజెన్సీలో స్థానిక గిరిజనులకు టీచర్ పోస్టుల్లో 100 శాతం రిజర్వేషన్లు తెచ్చాం




**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో నూరు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 2000 ఏడాదిలో జీ.వో నెంబర్ 3 తెచ్చామని సిఎం చంద్రబాబు గుర్తు చేశారు. న్యాయ సమీక్షలో రద్దయిన జీవో నెంబర్ 3 పునరుద్దరణకు తీసుకావల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు పాటిస్తూనే... 2020లో రద్దయిన జీ.వో నెంబర్ 3 పునరుద్దరణకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. సోమవారం సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. ఈ రివ్యూలో గిరిజన సంక్షేమ శాఖ, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ “1986లో వచ్చిన జీవో ప్రకారం ఏజెన్సీలో స్థానిక గిరిజనులకు టీచర్ పోస్టుల్లో 100 శాతం రిజర్వేషన్లు తెచ్చాం. దీనిపై న్యాయపరమైన చిక్కులు రావడంతో మళ్లీ పెరిగిన మహిళ రిజర్వేషన్ల శాతాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని 2000 సంవత్సరంలో జీవో ఎంఎస్ నంబర్ 3 తెచ్చాం. దీన్ని అమలు చేయడం ద్వారా సుమారు 4,626 టీచర్ ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు దక్కాయి. అయితే జీవో నెంబర్ 3 పై 2002లో కొందరు కోర్టును ఆశ్రయించగా... - మిగతా 3లో

# నర్సుల సేవలు అమోఘం



- ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సులకు సత్కారం
- నర్సుల చేతి స్పర్శ కూడా రోగిలో మానసిక స్థైర్యాన్ని, సాంత్వన కలిగిస్తుంది
- ‘విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరచిపోరు.

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

వైద్య రంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని, ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో... రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొనియాడారు. నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివని అన్నారు. నర్సుల చేతి స్పర్శ కూడా రోగిలో మానసిక స్థైర్యాన్ని, సాంత్వన కలిగిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులతో సమావేశం అయ్యారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రశంసనీయ సేవలు అందించిన ఎనిమిది మంది స్టాఫ్ నర్సులను సత్కరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ “విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరచిపోరు. మీరు పడే శ్రమ, కష్టం నాకు తెలుసు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మీరు విధులు నిర్వర్తించిన విధానం మరువలేం. ఇటీవల సింగపూర్ లో నా కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదానికి గురైనప్పుడు ఆసుపత్రిలో - మిగతా 3లో




# ప్రతి ఏటా నర్సులకు అవార్డులు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో నర్సుల సేవలు అద్వితీయం
- ప్రతి ఒక్కరూ హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలి
- కాంట్రాక్ట్ పద్ధతిన త్వరలో 5,300 నర్సింగ్ పోస్టుల భర్తీ
- అంతర్జాతీయ నర్సుల దినోత్సవంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

# ఏజెన్సీలో గిరిజనులకే వంద శాతం ఉద్యోగాలు కల్పిస్తాం

-మొదటిపేజీ తరువాయి

వివిధ స్థాయిల్లో విచారణ అనంతరం 2020లో ఈ ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. అయితే గత ప్రభుత్వం దీనిపై రివ్యూ పిటిషన్ వేయడంలో తీవ్ర నిర్లక్ష్యం పాటించింది. దీంతో రివ్యూ పిటిషన్ ను కూడా సుప్రీం కోర్టు కొట్టేసింది. ఈ కారణంగా గిరిజనులు జీవో నెంబర్ 3 ద్వారా లభించే లబ్దిని కోల్పోయారు" అని సిఎం అన్నారు.

జీవో నెంబర్ 3 పునరుద్ధరిస్తాం

జీవో నెంబర్ 3 పునరుద్దణ లేదా అదే తరహా న్యాయం చేసేందుకు గిరిజనులకు ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు జీ.వో నెంబర్ 3 రద్దు అనంతర పరిణామాలపై అధికారులతో సీఎం చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో జీవో 3 ద్వారా నాడు గిరిజనులకు కలిగిన లబ్దిని పునరుద్ధరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఏజెన్సీలో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు నూరు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న అవకాశాల గురించి, చట్టపరంగా ఉన్న వివిధ అనుకూలతలు, అడ్డంకుల గురించి చర్చించారు. జీ.వో నెంబర్ 3 పునరుద్ధరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గిరిజనుల, గిరిజన సంఘాల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలి సిఎం అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో తిరిగి ఈ ఉత్తర్వుల ద్వారా లభించే లబ్దిని




గిరిజనులకు తిరిగి అందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని... ఇందులో భాగంగా న్యాయ పరమైన అంశాలు, సుప్రీంకోర్టు తీర్పు, గిరిజన హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేయాలని సిఎం అన్నారు.

మూడు ఆప్షన్లు..

జీవో నెంబర్ 3 పునరుద్ధరణపై ప్రస్తుతం ఉన్న మూడు అవకాశాల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొదటి ఆప్షన్‌గా ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో 100 శాతం రిజర్వేషన్లు స్థానిక గిరిజనులకు కల్పించడం, రెండవ ఆప్షన్‌గా స్థానిక గిరిజనులకు వారి యొక్క జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం, మూడవ ఆప్షన్‌గా సుప్రీంకోర్టు సూచించినట్టు 50 శాతం మించకుండా స్థానిక గిరిజనులకే రిజర్వేషన్లు కల్పించి వారి హక్కులను పరిరక్షించడం వంటి అవకాశాలను అధికారులు సిఎం దష్టికి తీసుకువచ్చారు. దీనిపై సిఎం మాట్లాడుతూ "గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో గిరిజనుల హక్కులకు కట్టుబడి ఉన్నామని...ఎన్నికల సమయంలో చెప్పినట్లు జీ.వో నెంబర్ 3 పునరుద్ధరించడం లేదా...అదే స్థాయిలో గిరిజనులకు న్యాయం చేయడానికి కట్టుబడి ఉన్నాం. ఈ విషయంలో జాతీయ స్థాయిలో రాజ్యాంగ, న్యాయ నిపుణులతో కూడా సంప్రదింపులు జరపాలి" అని సిఎం అన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు...విద్య%-%వైద్య సదుపాయాలు కల్పిస్తూ, ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని సీఎం అన్నారు. వారికి న్యాయం చేసేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని వదులుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# కేశినేని యూ టర్న్...

**విజయవాడ :** బెజవాడ పాలిటిక్స్ మళ్లీ హీటెక్కుతున్నాయి. మాజీ ఎంపీ కేశినేని నాని తిరిగి యాక్టివ్ అవుతున్నారు. రాజకీయంగా ఆయన త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. తిరిగి వైసీపీలో యాక్టివ్ అవ్వాలని ఆయన యోచిస్తున్నారని సమాచారం. విజయవాడ పార్లమెంటుకు 2024, 2019 ఎన్నికల్లో గెలిచిన కేశినేని నానిని పార్టీ నాయకత్వం పక్కన పెట్టింది. ఆయన సోదరుడు కేశినేని చిన్నిని పార్టీలోకి తీసుకు వచ్చి మంచి స్థానం ఇచ్చింది. అయితే ఆగ్రహించిన కేశేనేని నాని టీడీపీని వీడి వైసీపీలోకి వెళ్లిపోయారు 2024 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత కేశినేని నాని సంచలన నిర్ణయం తీసుకున్నారు. తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పారు.రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే ఆయన తిరిగి రాజకీయంగా యాక్టివ్ అవుతున్నట్లు స్పష్టంగా కనపడుతుంది. తనకు విజయవాడ అంటే ప్రేమ అని పిచ్చి అని కేశినేని నాని గతంలో ఒక సందర్భంలో తెలిపారు. విజయవాడ అంటే ప్రేమతోనే తాను రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ సేవ చేయడానికి ముందుంటానని తెలిపారు. అయితే సేవ చేయాలంటే రాజకీయాలు అవసరమని గుర్తించిన కేశినేని నాని త్వరలోనే తిరిగి వైసీపీ జెండా పట్టుకుని తిరిగే అవకాశాలున్నాయంటున్నారు. కేశినేని నాని రాజకీయంగా రీ ఎంట్రీ ఇవ్వాలంటూ ఆయన సన్నిహితులు కూడా వత్తిడి తెస్తున్నారు. పదేళ్ల పాటు అనుభవించిన దర్పం, రాజకీయానికి దూరం కావడం ఇష్టం లేని నాని తిరిగి ఫ్యాన్ వైపు చూస్తారంటున్నారుకేశినేని నాని తొలుత బీజేపీ చేరాలనుకున్నా కూటమిలో టీడీపీతో కలసి ఉండటంతో తనకు బెజవాడ టిక్కెట్ దొరకదని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. అందుకే బీజేపీ వైపు కాకుండా తిరిగి వైసీపీలోనే యాక్టివ్ కావాలని భావిస్తున్నారు. మంచి సమయం చూసుకుని ఆయన తిరిగి వైసీపీలో యాక్టివ్ అవుతారని బెజవాడలో టాక్ బలంగా వినిపిస్తుంది. కూటమి ప్రభుత్వం పై ఏడాది పాలనలో ఏర్పడిన అసంతృప్తి ఈసారి



తన గెలుపునకు ఖచ్చితంగా కారణమవుతుందని భావిస్తున్నారు. తనను నమ్ముకున్న వారికి కూడా న్యాయం చేయాలంటే రాజకీయాలలో కొనసాగాలని నిర్ణయించుకున్నారని, అందుకే త్వరలోనే కేశినేని భవన్ నుంచి ఒక ప్రకటన వెలువడే అవకాశముందని తెలిసింది.అందుకే ట్రయల్ లో భాగంగా తన సోదరుడు, ప్రస్తుత విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై రోజూ ఆరోపణలు చేస్తున్నారు. నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ట్యాగ్ చేస్తూ రోజుకొక పోస్టు పెడుతున్నారు. విశాఖలో అర్సా సంస్థలకు భూముల కేటాయింపు నుంచి విమర్శలు మొదలుపెట్టిన కేశినేని నాని తాజాగా మద్యం కుంభకోణంలో కూడా చిన్ని ప్రమేయం ఉందన్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఇదంతా తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి వచ్చిన స్క్రిప్ట్ అంటూ టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. అయినా వెనక్కు తగ్గని కేశినేని నాని విజయవాడ ఎంపీపైన, తన సోదరుడినే లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తుండటంతో బెజవాడ ఎంపీగా పోటీ చేయడానికేనని విశ్లేషకులు కూడా అంటున్నారు. మరి ఎప్పుడు ప్రకటన వస్తుందన్నది చూడాలి. ఈ నేపథ్యంలోనే బెజవాడ పాలిటిక్స్ హీటెక్కాయి.

# మద్యం కుంభకోణంలో తవ్వేకొద్ది విస్తుపోయే నిజాలు

**నెల్లూరు :** వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే అధికారంలోకి వచ్చిన వెంటనే సిఐడి ప్రాథమిక స్థాయి విచారణ చేపట్టింది. అటు తరువాత ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటయింది. విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి దర్యాప్తు బృందం విచారణను కొనసాగించింది. దాదాపు 3,500 కోట్ల రూపాయల కుంభకోణం జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యంతో చాలామంది అనారోగ్యానికి గురైనట్లు నిపుణుల కమిటీ సంచలన నివేదిక ఇచ్చింది. కాలేయంతో పాటు నాడీ సంబంధిత వ్యాధులు భారీగా పెరిగాయని స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే మద్యం కుంభకోణంలో మనీ ల్యాండరింగ్ జరిగిందన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఈడి ఎంట్రీ ఇచ్చింది. సిట్ దర్యాప్తు నివేదిక అనుగుణంగా విచారణ చేపట్టేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది.మద్యం కుంభకోణం పై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగుతోంది. అదే సమయంలో నిపుణుల కమిటీ సైతం అప్పటి మద్యంతో జరిగిన అనారోగ్య అనర్ధాలను గుర్తించే పనిలో పడింది. అయితే నిపుణుల విచారణలో సంచలన అంశాలు బయటపడ్డాయి. 2019 నూతన మద్యం పాలసీ అందుబాటులోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. అయితే ఈ దుకాణాల్లో లభించిన మద్యం తాగిన వారిలో కాలేయవ్యాధులు రెట్టింపు అయ్యాయి. సాధారణంగా మద్యం తాగితే కాలేయ వ్యాధులు సంక్రమిస్తుంటాయి. 2014 నుంచి 2019 మధ్య 14 వేల వరకు ఉన్న మద్యపాన సంబంధిత కాలేయ వ్యాధులు.. 2019 తర్వాత రెట్టింపు అయ్యాయి. రికార్డు స్థాయిలో 29,369 కి పెరిగాయి. ఐదేళ్లతో పోలిస్తే ఏకంగా 100% రుగ్మతలు పెరిగాయి. నాడీ సంబంధిత వ్యాధుల పరిస్థితి కూడా అలానే ఉంది. ఏకంగా నాడీ వ్యాధులు 892 శాతానికి పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మద్యం తాగిన వారిలో 2014 నుంచి 2019 మధ్య నాడి సంబంధిత వ్యాధిగ్రస్తులు 1276 మంది ఉంటే.. 2019 తర్వాత ఆ సంఖ్య 12,663 కు చేరడం విస్మయ పరుస్తోంది.కిడ్నీ వ్యాధులు, మానసిక రుగ్మతలకు అప్పటి మద్యం కారణమని తాజా విచారణలో వెల్లడయ్యింది. 2019 అక్టోబర్లో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రారంభించింది. అయితే అంతకుముందు అన్ని రకాల ప్రీమియం బ్రాండ్లు అందుబాటులో ఉండేవి. కానీ దేశంలో ఎక్కడా చూడని, వినని మద్యం బ్రాండ్లు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో లభించేవి. అప్పట్లో నాసిరకం మద్యం అమ్మకాలపై విపక్షాలు గట్టిగానే ప్రశ్నించాయి. కానీ వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పెడచెవిన పెట్టింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మద్యం డిస్టలరీలన్నీ వైయస్సార్సీపీ నేతల వేనని ఆరోపణలు ఉన్నాయి. ఏ కంపెనీ కమిషన్లు ఎక్కువగా ముట్టచెబితే వాటి సరఫరాకు అప్పటి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేది. మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయిన రాజ్ కసిరెడ్డి నేతృత్వంలో అప్పటి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు హైదరాబాదులో ఈ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి మద్యం సీసా పై 50 రూపాయల కు తగ్గకుండా కమీషన్లు దండుకున్నారని సిట్ దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. నాసిరకం మద్యం సరఫరా చేసి.. ప్రజారోగ్యానికి భంగం వాటిల్లినట్లు అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. చాలా రుగ్మతలతో ప్రజలు చనిపోయారు. కానీ అవన్నీ నాసిరకం మద్యం వల్లేనని ఆరోపణలు వచ్చినా.. అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కనీస స్థాయిలో కూడా స్పందించలేదు.ఇప్పటివరకు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ విచారణ చేపట్టింది. విచారణలో తేలిన అంశాలను.. కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈడి మరోసారి దర్యాప్తును ముమ్మరం చేసింది. ప్రాథమిక నివేదిక ఆధారంగా దర్యాప్తులో పలు అంశాలపై దృష్టి పెట్టింది. అప్పట్లో జాతీయ ప్రీమియం బ్రాండ్లను పక్కనపెట్టి.. వైయస్సార్ కాంగ్రెస్ నేతలకు చెందిన కంపెనీల నుంచి, కమీషన్లు ఎక్కువగా ఇచ్చిన సంస్థల నుంచి మద్యం ఆర్డర్ చేసినట్లు పక్కా ఆధారాలు సేకరించినట్లు సమాచారం. జాతీయస్థాయిలో పేరుమోసిన ప్రీవియం మద్యం బ్రాండ్లను పక్కనపెట్టి.. ఆంధ్ర గోల్డ్ విస్కీ, గుడ్డు ఫ్రెండ్స్ విస్కీ, డేర్ హౌస్ బ్రాందీ, ఛాంపియన్ స్పెషల్ విస్కీ, హాట్స్ డిజైర్ విస్కీ వంటి కొత్త, స్థానికంగా ఉత్పత్తి చేయబడిన ప్రాణులను నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేశారని తాజాగా తేలింది. కేవలం నాసిరకం మద్యంతో ఏపీ ప్రజల ఆరోగ్యానికి భంగం వాటిల్లిందని తెలియడం సంచలనం కలుగుతోంది.

## అత్యవసర పనులూ నాణ్యతగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, కడా కమీషనర్ రాంసుందర్ రెడ్డి, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. గుర్రపుడెక్క, తూటికాడ వంటి వాటి తొలగింపుకోసం, మందుల పిచికారీకి డ్రోన్లు సైతం వినియోగించుకోవాలని సూచించారాయన. అవసరమైన చోట్ల 7 రోజుల వ్యవధితో షార్ట్ టెండర్లు పిలవడానికి అనుమతిచ్చిందని, నిర్వహణ మరియు మరమ్మత్తు పనులను చేపట్టడం యొక్క ప్రధాన లక్ష్యం, 2025 ఖరీఫ్ ప్రారంభానికి ముందు నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్దితికి తీసుకురావడం అని ఆయన అధికారులకు సూచించారు. గేట్లు, షట్టర్లు, వంటి మెకానికల్ పనులను తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజనీర్ పరిశీలించి, సక్రమంగా పనిచేసే స్దితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని, చీఫ్ ఇంజనీర్ కు ఇవ్వాలని ఆదేశించారు. సాగు నీటి సంఘాలు ఆధ్వర్యంలో, వారి పరిధిలోని పనులను, మే నెలాఖరుకు పూర్తిచేయాలి.ఇలా పనులను సకాలంలో పూర్తిచేయడానికి చీఫ్ ఇంజనీర్లు, సూపరిండెంట్ ఇంజనీర్లు నిరంతరంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఎట్టి పరిస్దితుల్లోనూ అన్ని పనులూ, సీజన్ మొదలయ్యే నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రి నిమ్మల రామానాయుడు, గతంలో మాదిరిగా కాకుండా మే చివరి నాటికి, అన్ని అత్యవసర పనులు, నాణ్యత తో పూర్తి చేయాలని ఆదేశించారు.

## నర్సుల సేవలు అమోఘం

-మొదటిపేజీ తరువాయి

ఉన్న సమయంలో అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరోసారి మీ కష్టం గుర్తుకువచ్చింది. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మిమ్మల్ని కలిసే అవకాశం రావడం ఆనందాన్నిచ్చిందని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో రెండు రోజులు తీవ్రమైన వడగాలులు

-మొదటిపేజీ తరువాయి

నరసరావుపేట మండలం కాకానిలో 43.7 సెం.గ్రే, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 43.5, ప్రకాశం జిల్లా జువ్విగుంటలో 43.3, ఎన్టీఆర్ జిల్లా మొగులూరులో 43.1, తూర్పుగోదావరి జిల్లా చిట్యాల 42.8, ఏలూరులో 42.6, విజయనగరం జిల్లా ధర్మవరంలో 42.5, తిరుపతి జిల్లా గూడూరు 42.3 సెంటీగ్రేడ్ చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. పల్నాడు 21 ప్రాంతాల్లో, ఎన్టీఆర్ 15, ప్రకాశం 12, బాపట్ల 9, గుంటూరు 8 సహా ఇతర చోట్ల కలిపి 116 ప్రాంతాల్లో 41 సె.గ్రే పైగా ఉష్ణోగ్రతలు రికార్డైనట్లు వివరించారు. ఎండలో బయటకు వెళ్లేప్పుడు నెత్తికి టోపి పెట్టుకోండి లేదా రూమాలు కట్టుకోండి, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించండి. అదేవిధంగా మీ కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించండి. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలి. గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగకూడదని, శారీరక శ్రమతో కూడిన కఠినమైన పనులను ఎండలో చేయరాదని సూచించారు. మరోవైపు రేపు రాయలసీమ జిల్లాల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పిడుగులు, ఈదురుగాలులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు హెూర్డింగ్స్, చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదన్నారు.

## ప్రతి ఏటా నర్సులకు అవార్డులు

**అమరావతి :** ప్రతి ఏటా నర్సులకు అవార్డులు ఇస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సోమవారం తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ నర్సెస్, మిడ్‌వైవ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి చాలా పవిత్రమైందని, సేవా భావంతో పనిచేస్తేనే ఆ వత్తికి న్యాయం చేయగలరని అని అన్నారు. దేశ రక్షణకు సరిహద్దుల్లో సైనికులు ఏవిధంగా పాటుపడతారో నర్సులు కూడా ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేందుకు తమ సేవలను ఆవిధంగానే అందిస్తున్నారన్నారు. వైద్య రంగంలో పనిచేస్తున్నవారు సైనికులుకన్నా తక్కువేమీ కాదన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా సమయంలో వీరు అందించిన సేవలు ప్రతి ఒక్కరూ గుర్తించుకున్నారన్నారు. రోగులకు చిరునవ్వుతో సేవలందించి వారిని చిరునవ్వుతో ఇంటికి పంపించేలా పనిచేయాలన్నారు. తమ పవిత్ర వత్తికి న్యాయం చేస్తున్నామా లేదా అనేది ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హక్కుల గురించి మాట్లాడుతున్నపుడు బాధ్యతలను కూడా మర్చిపోకూడదన్నారు. ప్రజలకు మేం జవాబుదారీ కాబట్టి బాధ్యతల నిర్వహణపై ప్రతి ఒక్కరినీ ప్రశ్నిస్తామని, మానవతా దక్పథంతో కూడా ఆలోచిస్తామన్నారు. నేను బాధ్యతల గురించి మాట్లాడితే నన్నే ప్రశ్నిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో 5,300 నర్సింగ్ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగులను నవ్వుతూ ఆహ్వానించి, వైద్యం అందించి, సంతోషంగా పంపించాల్సిన అవసరం ఉందన్నారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ డీ.ఎస్.వీ.ఎల్. నర్సింహమ్ మాట్లాడుతూ నర్సుల ఉద్యోగ అవకాశాల్లో మెరుగుదల కోసం విదేశీ భాషల్లో శిక్షణను అందించనున్నామన్నారు. దీనివల్ల గ్లోబల్ గా మన వాళ్లు నర్సుల పోస్టులను అందుకోగలరన్నారు.

**అవార్డులు వీరికే..**

రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ నుండి అవార్డుల్ని అందుకున్నవారిలో విశాఖపట్నం ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సత్యవల్లి, విశాఖపట్నం అమెరికన్ ఎన్ఆర్ఐ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సిబా ఫ్రాన్సిస్, రేణిగుంట పిహెచ్‌సి ఎంపిహెచ్‌డబ్ల్యు పి. రోహిణి, జంగారెడ్డిగూడెం ఎన్ఎంఎన్ ఏరియా ఆసుపత్రి స్టాఫ్ నర్సు మేడిడి నిరీక్షణ కుమారి, తిరుపతి పద్మావతి నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. గంగాభవాని ఉన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (అకడమిక్) డాక్టర్ రఘునందనరావు, ఆంధ్రప్రదేశ్ నర్సెస్ అండ్ మిడ్ వైవ్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కే. సుశీల, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డీ. వెంకటేశ్వరరావు, ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జెనీ కెంప్, డిప్యూటీ డైరెక్టర్ (నర్సింగ్) ఎస్. జ్యోతి, నర్సింగ్ కళాశాలల విద్యార్థినులు తదితరలు పాల్గొన్నారు.

## రాజకీయాలకు గల్లా ఫ్యామిలీ దూరమేనా

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ లో గల్లా కుటుంబం రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకున్నట్లే కనిపిస్తుంది. ఇక ఆ కుటుంబం నుంచి రాజకీయాల్లో యాక్టివ్ అయ్యే వారు కూడా కనిపించడం లేదు. గల్లా అరుణ కుమారి వృద్ధాప్యంతో ఆమె రాజకీయాల నుంచి తప్పుకున్నారు. ఇక ఆమె కుమారుడు గల్లా జయదేవ్ కూడా గతంలో గుంటూరు ఎంపీగా రెండు సార్లు గెలిచి తర్వాత 2024 ఎన్నికలకు ముందు తాను రాజకీయాలకు కొంతకాలం విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. 2024 జరిగిన ఎన్నికల్లోనూ కూటమికి వీచిన బలమైన గాలిలో గల్లా జయదేవ్ ఖచ్చితంగా విజయం సాధించే వారు. మరోసారి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యేవారు. అంతా బాగుంటే కేంద్ర మంత్రిగా కూడా అయ్యేవారు. కానీ తనంతట తానే తప్పుకోవడంతో ఆయన స్థానంలో గుంటూరు ఎంపీగా పోటీ చేసి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రమంత్రి అయ్యారు.2024 ఎన్నికలకు ముందు గల్లా జయదేవ్ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు. అయితే కొద్దికాలమేనని, తాను మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని ఆయన తెలిపారు. వ్యాపారాలను గాడినపెట్టేందుకు వాటిని విస్తరించేందుకే గల్లా జయదేవ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రాజకీయాల్లో ఉండి వ్యాపారాలు చూసుకోవడం కష్టమని భావించి ఆయన వ్యాపారాలకే ప్రాధాన్యత ఇచ్చారు. రాజకీయాల్లోకి ఎప్పుడైనా మళ్లీ ఎంట్రీ ఇవ్వవచ్చని, వ్యాపారాలు ఒకసారి దెబ్బతింటే అన్ని రకాలుగా కోలుకోలేకుండా పోతామని ఆయన అంచనా వేసి ఈనిర్ణయం తీసుకున్నారు. ఆయన నిర్ణయంలో వాస్తవాలు చాలా ఉన్నాయనే అనుకోవాలి.కానీ ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చినా ఆయన పోటీచేయడానికి ఎక్కడా ఖాళీలేదు. గుంటూరు నియోజకవర్గానికి టీడీపీ నేతగా పెమ్మసాని చంద్రశేఖర్ వచ్చారు. ఆయన కూడా వ్యాపారవేత్త. ఎంపీలలోనే అత్యంత సంపన్నుడు కూడా. గుంటూరు జిల్లాకు స్థానికుడు. ఆర్థికంగా బలవంతుడు. ఇక గుంటూరు నియోజకవర్గం మాత్రం గల్లా జయదేవ్ చేతుల్లోకి మళ్లీ రాదన్నది కూడా అంతే వాస్తవం. పెమ్మసానిని కాదని గల్లా జయదేవ్ కు భవిష్యత్ లో తెలుగుదేశం పార్టీ టిక్కెట్ ఇచ్చే అవకాశం అస్సలు ఉండదు. అందుకే ఇక గుంటూరు నియోజకవర్గం గల్లా రాజకీయ డైరీ నుంచి కొట్టి వేయక తప్పదని ఆయనకు అర్థమయింది. అందుకే రాజకీయాలకు దూరంగా ఉన్నారు.పరిస్థితుల్లో గల్లా జయదేవ్ కు 2029 ఎన్నికల్లో ఏ నియోజకవర్గం ఖాళీ లేదు. కూటమి పార్టీలు మళ్లీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశముండటంతో అన్ని ప్రధానమైన పార్లమెంటు నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీలకు చెందిన నేతలున్నారు. ఇక శాసనసభకు

# అర్జీదారుడికి రసీదును వాట్సాప్ లో పంపించాలి

– : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,





**అంకుశం న్యూస్అనంతపురం, మే 12 :** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పిజిఆర్ఎస్ ని మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) సిబ్బంది, కలెక్టరేట్లో అర్జీలు రాసేవారు, ఆన్లైన్లో అప్లోడ్ చేసే సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీదారుడికి రసీదును వాట్సాప్ లో పంపించాలన్నారు. పిజిఆర్ఎస్ కు సంబంధించి అర్జీదారుడు అర్జీ ఇచ్చాక ఆన్లైన్లో రిజిస్టర్ చేసిన వెంటనే వారికి మెసేజ్ వెళ్తుండగా, అర్జీదారులందరికీ రసీదును వాట్సాప్ నంబర్ కు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీ రాసేటప్పుడు గతంలో పిటిషన్ ఇచ్చారా, దాని రసీదును తీసుకురావాలని, పాత పిటిషన్ ల అక్నాలెడ్జిమెంట్ కావాలని అడగాలన్నారు. ఇంతకుముందు ఇచ్చిన అర్జీకి సంబంధించిన రసీదు ముఖ్యమని అర్జీదారులకు తెలపాలని, రసీదు తీసుకువచ్చి చూపిస్తే పరిష్కారం చేస్తామని తెలియజేయాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీ రాసేటప్పుడు సమస్యను అర్జీరాసే సిబ్బంది అర్థం చేసుకోవాలన్నారు. మ్యూటేషన్లు కావాలి, సరిహద్దు చూపించాలి, పట్టాదారు పాస్ బుక్కులు కావాలి, చుక్కల భూములు తొలగించాలి, తదితర అన్ని ల్యాండ్ సేవలకు సంబంధించి సచివాలయాల్లో అందించే వివరాల జాబితా అర్జీలు రాసే సిబ్బందికి అందించాలని, దానిని వారందరూ చదువుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీలు రాసేందుకు మరింత మంది సిబ్బందిని నియమించాలని, వారికి అవసరమైన ల్యాప్ టాప్ లను, ప్రింటర్లను ఏర్పాటు చేయాలన్నారు. విఐపి సూచనలు, లీగల్ సెక్షన్, సీఎం పిటిషన్లు, ఎన్హెచ్ఆర్సి, లోకాయుక్త, ఎస్సీ, ఎస్టీ కమిషన్, తదితర అర్జీలకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని, వాటిని పరిష్కారం చేయాలన్నారు. ఆయా అర్జీలను వ్యక్తిగతంగా పరిష్కరించాలని సూచించడం జరిగిందని, విఆర్ఓలు, తహసీల్దార్ లు గ్రామానికి వెళ్లారా, ఎలాంటి పరిష్కారం చేశారు అనేది ఫోటోగ్రఫీతో తెలియజేయాలన్నారు. పిజిఆర్ఎస్ సిటిజన్ యాప్ రిపోర్ట్ రోజువారిగా అందించాలన్నారు. పిజిఆర్ఎస్ పరిష్కారం పట్ల అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు.

– ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, సిపిఓ అశోక్ కుమార్, డిటిసి వీర్రాజు, పిజిఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, కమాండ్ కంట్రోల్ రూమ్, పిజిఆర్ఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాను నిరుద్యోగ

# యువత సద్వినియోగం చేసుకోండి మంత్రి సవిత



**అంకుశం న్యూస్ పెనుకొండ మే 12 :**నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని మంత్రి సవితమ్మ అన్నారు. రేపు పెనుకొండ లోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఆవరణంలో మెగా జాబ్ మేళాను ప్రారంభిస్తున్నామన్నామని. నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలన్నారు. ఈ జాబ్ మేళాలో 60 కంపెనీలో పాల్గొని దాదాపు2000 మందికి కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. మెగా జాబ్ మేళాలో Techmahindra, EdubridgeIndia ( Capgemini), Hyundai Motors, Tata electronics, JY Software Solutions, ఫ్లిప్ కార్ట్, హెటేరో డ్రగ్స్ ,wipro , genpact,Techwish software, Dr Reddyμs, Joyalukkas, కియా మోటార్స్, ముతూట్ ఫైనాన్స్, Quess Corp , Green tech ,Vetro techsoft solutions , Allsec టెక్నాలజీస్, అపోలో ఫార్మసీ,%Beets L soft solutions,Empowerment solutions, Adecco solutions,Agile airport services,igneous IT pvt solutions,Amaraja batteries,KML ,Threads IT Pvt Ltd,AIL Dixon , లాంటి 50 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనుచున్నాయన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో హాజరు అయ్యే నిరుద్యోగ యువతీ,యువకులు విద్యార్హతలు పదవ తరగతి,ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా,బి. ఫార్మసీ /M. ఫార్మసీ, నర్సింగ్ / ఎనీ డిగ్రీ , ఎనీ బి.టెక్, పి.జి, చదివిన వారు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని,ఈమెగా జాబ్ మేళా లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకి నెలకి రూ 10 వేల నుండి 50 వేల వరకు జీతం ఉంటుందని మంత్రి సవితమ్మ తెలిపారు..

## చంద్రబాబు వచ్చాకే

# గ్రామాల అభివృద్ధి కనిపిస్తోంది..పరిటాల సునీత





రామగిరి మండలంలో రూ.2కోట్ల నిర్మాణాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

గంగంపల్లి, గంగంపల్లి తండా, వెంకటాపురంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ప్రారంభం

**అంకుశం న్యూస్ అనంతపురం మే 12 :** గతంలో రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబు నాయుడు విశేషంగాకృషి చేస్తున్నారని కూటమి ప్రభుత్వం వచ్చాకే గ్రామాల్లో అభివృద్ధి కనిపిస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలంలో ఆమె సోమవారం 2కోట్లతో నిర్మించిన పలు నిర్మాణాలను ప్రారంభించారు. ముందుగా గంగంపల్లి తండాలో 50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. గంగంపల్లి నుంచి దుర్గమ్మ దేవస్థానం వరకు కోటి నిధులతో ఏర్పాటు చేసిన సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో 50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. నసనకోట పంచాయతీ పరిధిలో కొలువై ఉన్న దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి 18వ తేదీవరకు జరుగుతున్న నేపథ్యంలో పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు స్థానిక ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న పనులు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పూర్తవుతున్నాయన్నారు. గ్రామాల్లో రోడ్లు డ్రైనేజీల సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో శంకుస్థాపన చేసిన పనులు కూడా ముందుకు కదలలేదని విమర్శలు చేశారు. నసనకోట దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలు చాలా ఏళ్ల తర్వాత జరుగుతుండటంతో గ్రామస్తుల కోరిక మేరకు అక్కడ కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఉత్సవాలలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సునీత సూచించారు...

## రూ.50 లక్షలతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ కు భూమి పూజ చేసిన మంత్రి సుభాష్

– ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే12:** కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిల్లోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం కాజులూరు మండలం దుగ్గుదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ. 50 లక్షలతో నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (వైరాలజీ ల్యాబ్) భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తొలి దశలో 168 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ మంజూరు చేసిందన్నారు. ఆ యూనిట్స్ నెలకొల్పడం ద్వారా గతం కంటే మెరుగ్గా అన్ని రకాల వైద్య, రక్త పరీక్షలు 24 గంటల లోపు అందుతాయి అన్నారు . గత కరోనా సమయంలో కొన్ని పరీక్షలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఈ వైరాలజీ ల్యాబ్ ద్వారా సత్వర సేవలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.అలాగే వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేసిందన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ సేవలను వినియోగించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించు కోవాలని మంత్రి సుభాష్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్వో ఆర్ రమేష్, ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై సుప్రియ, డాక్టర్ జి. స్వాతి, పలువురు కూటమి పార్టీ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డిటిని కాపాడుకోవాలి

– ఏడవ రోజు రిలే దీక్షలో టివి చంద్ర మోహన్ రెడ్డి



**అంకుశం న్యూస్ అనంతపురం మే 11:** ఆర్డిటికి అడ్డంకులు ఆంక్షలు తొలగిపోయేందుకు చేసే ఉద్యమంలో అంతిమ విజయం తమదే అని క్రికెట్ కోచ్ టీవీ చంద్రమోహన్ రెడ్డి అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఆర్డిటి ఎఫ్ సి ఆర్ ఎ రెన్యువల్ వెంటనే చేయాలని సుగా మంచి శ్రీనివాసులు అధ్యక్షతన చేపడుతున్న ఏడవ రోజు రిలే నిరాహార దీక్షలకు ముఖ్య అతిథిగా క్రికెట్ కోచ్ టీవీ చంద్రమోహన్ రెడ్డి విచ్చేసి మాట్లాడారు. ఆర్డిటిలో వేలాది మంది విద్యార్థిని విద్యార్థులకు క్రీడల్లో రాణించే విధంగా కోట్ల రూపాయల ఖర్చు చేసిందన్నారు.అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం కూడా ఏర్పాటు చేసి జిల్లాకు పేరు తెచ్చిన ఘనత ఆర్డిటి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కే దక్కుతుందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని పేదలనే కాకుండా పట్టణ నగర ప్రాంతాల్లో కూడా అభివృద్ధికి అడుగులు వేసిన ఆర్డిటిని అనంతపురం జిల్లా ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు.అఖిలపక్ష కమిటీ జేఏసీ కన్వీనర్ సాకే హరి మాట్లాడుతూ.. పేదల పక్షపాతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కలలు సాకారం కావాలంటే ఆర్డిటిని కాపాడుకోవడమే మొదటి లక్ష్యమన్నారు.ఆర్డిటి ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ విషయంపై అన్ని రాజకీయ పార్టీలు ముఖ్యంగా కూటమి ప్రభుత్వం నాయకులు నోరు విప్పి మాట్లాడి ఆర్డిటిని కాపాడే విధంగా ముందుకు రావాలన్నారు.డిస్కవరీ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సేవ్ ఆర్డిటి సేవ్ అనంతపురం అన్న నినాదమే ఆర్డిటిని కాపాడుతుందన్న బలమైన నమ్మకంతో ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబులేసు.టీవీ రెడ్డి.బికేఎస్ ఆనంద్.పుట్లూరు ప్రభాకర్.భీమసేన రావు.మంజునాథ్.రామకృష్ణ.రాకెట్లసూర్యనారాయణ.రానా.శ్రీనివాసులు క్రికెట్ కోచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## చేనేత పట్టు రీలర్ కు ఘనంగా నివాళులు అన్నదానం



**అంకుశం న్యూస్ ధర్మవరం మే 11:** ధర్మవరం పట్టు చేనేత పరిశ్రమ కు చెందిన పట్టు రీలర్ టంగుటూరి తిరుపాల్ 4 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తూ గొట్లూరు అనాధ ఆశ్రమం లో అన్నదానం చేసారు. ఈ కార్యక్రమం లో దాడితోట సాయినాథ్ కుమార్, దాడితోట నవీన్ కుమార్ తోటపాటి శ్రీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## వీర జవాన్ కు తెలుగుదేశం పార్టీ ఘనంగా నివాళుల ర్యాలీ!



**అంకుశం న్యూస్ ధర్మవరం మే 11:** భారత్ యుద్ధ భూమి లో వీర మరణం పొందిన మురళీ నాయక్ కు ధర్మవరం లో తెలుగుదేశం పార్టీ యువ నేత పరిటాల శ్రీ రామ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పిస్తూ శ్రద్ధాంజలి ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమం లో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీ రామ్ రాష్ట్ర టీడీపీ నాయకులు కమతం కాటమయ్య,ఫణి కుమార్, పి. సుధాకర్, శ్రీ శైలం పురుషోత్తం గౌడ్, అంబటి సనత్, కిరోసిన్ పోతలయ్య, కత్తుల బాబ్జి,టీడీపీ మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి సుభాష్



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 11:**రాబోయేరోజుల్లో రామచంద్రపురం నియోజకవర్గాన్ని సుందరవనంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం రామచంద్రపురం నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న పలు బిటి రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తుందన్నారు. గతంలో రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని.. ప్రస్తుతం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల మీద దృష్టి సారించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలో ఆదివారం సుమారు 5 కోట్ల రూపాయల ఉపాధి హామీ నిధులతో వెల్ల –ద్రాక్షారామం రోడ్డు నుండి వెలగపూడి కుసుమంబ ఫీల్డ్ వరకు, బాపనయ్య చెరువు పంచాయతీలో వెంకటాయపాలెం గణపతి నగరం బిటి రోడ్డు, రామచంద్రపురం మున్సిపాలిటీలో కొత్తూరు నుండి మూలపాడు వరకు బిటి రోడ్డు, యనమల గ్రామం లో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను కూడా అందిస్తుందన్నారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామన్నారు. మే నెలలో తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం జూన్ నెలలో అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు అన్నారు. రాబోవు మూడు సంవత్సరాలలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని సుందరీకరంగా తీర్చిదిద్దామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, పంచాయతీరాజ్ ఏ ఈ యేసు రత్నం, ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.